ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు



వైద్య కళాశాలలను ప్రయివేటీకరించొద్దు


కాశీపట్నంలో సంతకాల సేకరణలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి -అనంతగిరి : ప్రభుత్వ వైద్యకళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటుకు కట్టబెట్టాలన్న కూటమి ప్రభుత్వం చర్యలను నిరసిస్తూ సోమవారం అనంతగిరి మండలం కాశీపట్నం కేంద్రం వద్ద వైసిపి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం. మత్యలింగం మాట్లాడుతూ పేద గిరిజనులకు నాణ్యమైన వైద్యం, వైద్యవిద్యను చేరువచేయాలనే లక్ష్యతో గత వైసిపి ప్రభుత్వ హాయంలో రాష్ట్రంలో 17 వైద్యకళాశాలను మంజూరు చేస్తే, అందులో ఒకటి పాడేరులో ఏర్పాటు చేశారన్నారు. దీన్ని ప్రయివేటుకు కట్టబెట్టాలను కోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిపి శెట్టి నీలవేణి, పార్టీ మండల అధ్యక్షులు సూర్యనారాయణ, సర్పంచ్ పాంగి. అప్పారావు పాల్గొన్నారు.

తుపానును ఎదుర్కోడానికి సర్వం సన్నద్ధం

- 12మండలాల్లో 163 ప్రభావిత గ్రామాల గుర్తింపు
- 63 పునరావాస కేంద్రాల ఏర్పాటు
- అత్యవసరానికి 11 హెలీప్యాడ్స్ సిద్ధం
- సహాయక చర్యలకు అవసరమైన ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కనే జిల్లా ఎస్‌పి, ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి-పాడేరు,: మొంథా తుఫానును ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అన్నారు.. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అప్రమత్తం చేశామన్నారు. . సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియాతో మాట్లాడుతూ తుఫాను సన్నద్ధతను వివరించారు. మొంథా తుపాన్‌వ మంగళవారం రాత్రికి కాకినాడ వద్ద తీరాన్ని దాటే నేపథ్యంలో మూడు రోజులపాటు ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు అధికారులు, ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు.

జిల్లాలో తుఫాను ప్రభావం 12 మండలాల పరిధిలోని 163 గ్రామాలపై పడే అవకాశం ఉందని ముందే గుర్తించామని, దానికి అనుగుణంగా పోలీసులు, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలో 63 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని, ఆహార పదార్థాలు, మందులు తదితర అత్యవసరమైన వాటిని సిద్ధంగా ఉంచామన్నారు. వాగులు, గెడ్డలు, రిజర్వాయర్లు, నదుల్లో నిరంతరం నీటి మట్టాన్ని గమనిస్తూ, ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నామన్నారు. నిండుగా ఉన్న రిజర్వాయర్లలో ముందు జాగ్రత్త చర్యగా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. గండ్లు పడే అవకాశం ఉన్నచోట ఎఇఇలకు పర్యవేక్షణా బాధ్యతలను అప్పగించామన్నారు. పంటనష్టం కలగకుండా వ్యవసాయ శాఖాధికారులతో సూచనలు అందిస్తున్నామన్నారు. 11 హెలిప్యాడ్స్ అత్యవసర పరిస్థితిలో పెట్టామన్నారు. కమ్యూనికేషన్‌కు ఎటువంటి ఇబ్బంది రాకుండా అయా మొబైల్ నెట్వర్క్ సంస్థల నుండి ప్రత్యక బృందాలు ఏర్పాటు చేశామని, శాటిలైట్ ఫోన్స్ ఏర్పాటు చేశామన్నారు. రహదారుల మరమ్మతులకు 14 ప్రత్యక బృందాలు సిద్ధం చేశామని, 82 దుర్లభమైన పాయింట్స్ గుర్తించి అక్కడ పోలీస్, రెవెన్యూ శాఖల సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రార్థన, పబ్లిక్ స్థలాలు, గ్రామాల్లో ఆటోల్లో మైక్‌ద్వారా ప్రచారం చేసి ప్రజలను అప్రమత్తం చేశామన్నారు.


విద్యాసంస్థలకు రెండు రోజులు సెలవులు ప్రకటించామని, సంక్షేమ వసతిగృహాల పిల్లలను బయటకు వదలకుండా చూడాలని సూచించామన్నారు. చెట్లు, కొమ్మలు విరిగిపడే అవకాశం ఉన్నందున, వాటిని వెంట వెంటనే తొలగించేందుకు 21 క్రేన్స్ , పవర్ సా తదితర పరికరాలను, జిల్లాకు 5 చెక్ పోస్ట్‌ల దగ్గర సిద్ధంగా ఉంచామని చెప్పారు. విద్యుత్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు, సబ్ స్టేషన్లలో అదనపు సిబ్బందిని సైతం సిద్ధంగా ఉంచమని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రసవానికి 10 రోజులు గడువు ఉన్న గర్భిణులను సైతం ముందు జాగ్రత్తగా ఆసుపత్రికి తరలిస్తున్నామ్నఅ్నరు. మత్స్యకారులంతా సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, అందరూ ప్రస్తుతం తమ గ్రామాల్లోనే ఉన్నారని సమాచారం వచ్చిందని కలెక్టర్ వివరించారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏదైనా సమస్య ఉత్పన్నమైతే 7780292811 నెంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌పి అమిత్ బర్దర్, పాడేరు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, ఆర్‌డిఒ లోకేశ్వరరావు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న పెస్‌డిసి అంబేద్కర్

రాజవొమ్మంగి: తుఫాన్ ప్రభావం నేపథ్యంలో మండలంలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ సోమవారం పర్యటించారు. మండలంలోని రాజవొమ్మంగి, దూసరపాము, తంటికొండ, ఒట్టిగడ్డ, తదితర గ్రామాల్లో మండల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే అధికారుల బృందం గ్రామాల్లో చర్యలు చేపడుతున్నారని, తుఫాను తగ్గేవరకు ప్రజలు బయటకు రావద్దన్నారు. వాగులు దాటకూడదని, రేకులషెడ్లు, పాత భవనాల్లో ఉండకూడదని సూచించారు. రాజవొమ్మంగిలో బిసి వసతిగృహం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల ను సోమవారం వేరే వసతి గహానికి తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు, ప్రజలకు పలు సూచనలు చేశారు. తహశీల్దార్ అల్లు సత్యానారాయణ, ఎంపిడిఒ లోకుల యాదగిరీశ్వర రావు, ఎస్ఐ శివకుమార్ పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పర్యాటక ప్రాంతాల మూసివేత




మూతబడిన బొర్రా గుహలు

ప్రజాశక్తి- అనంతగిరి : మొంథా తుపాన్ నేపథ్యంలో అధికారుల ఆదేశాలతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రముఖ పర్యాటక కేంద్రాలన్నీ మూతబడ్డాయి. బొర్రా గుహలను సంబంధిత అధికారులు సోమవారం తెల్లవారుజాము నుండే మూసివేశారు. బొర్రా గుహలు సమిపంలో ఉన్న కటికి, అనంతగిరి పంచాయతీ తాడిగుడ, అలాగే చిట్టెంపాడు, సరియా తదితర జలపాతాలకు సందర్శకులను అనుమతించలేదు. పంచాయతీ. పోలీస్ శాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే నో ఎంట్రీ బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలు గెడ్డలు దాటి బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితి సమయంమైతే పంచాయతీ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సోమవారం మండల కేంద్రంలో జరగవలసిన వారపు సంతను కూడా అధికారులు రద్దు చేశారు.

చాపరాయిలో సందర్శకులకు నో ఎంట్రీ

డుంబ్రిగుడ : మొంథా తుపాన్ కారణంగా మండల కేంద్రంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజులపాటు పర్యాటకుల ప్రవేశాలను నిలిపివేస్తున్నట్లు ఇన్‌ఛార్జి మేనేజర్ అప్పారావు తెలిపారు. తుపాను కారణంగా చాపరాయి జలపాతంలో నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా సందర్శకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూసేసినట్లు తెలిపారు. దీంతో సందర్శకులతో కిటకిటలాడిన చాపరాయి జలపాతం బోసిపోయింది.


సందర్శకులను అనుమతించని చాపరాయి జలపాతం

ఆదివాసీలను జలసమాధి చేయొద్దు

- మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వద్దు
- దేవరపల్లిలో ఆదివాసీల భారీ ర్యాలీ, నిరసన
- 'నవయుగ' కంపెనీ దిష్టిబొమ్మ దగ్ధం


దేవరపల్లిలో నవయుగ కంపెనీ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అరకులోయ/ అరకులోయ రూరల్: ఆదివాసులకు జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వద్దే వద్దనిఅరకులోయ మండలం బస్కీ పంచాయతీ దేవరపల్లి గ్రామంలో సోమవారంఆదివాసులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నవయుగ కంపెనీ దిష్టిబొమ్మను గిరిజనులు దగ్ధం చేశారు. గో బ్యాక్ నవయుగ,హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పోరాట కమిటీ కన్వీనర్ బురిడి దశరథ్, వైసిపి నేత కిల్లో రామన్న మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో తమ గ్రామాలను జల సమాధి చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్‌తో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిపుణుల కమిటీ సమావేశం రద్దు చేయాలని డిమాండ్ చేశారు .హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి జారీచేసిన జిఒలు 2,13,51 తక్షణమే రద్దు చేయాలన్నారు. గిరిజనులు భారీ ఎత్తున ఎక్కడికక్కడే ధర్నాలు, రాస్తారోకులు, బహిరంగ సభలు పెట్టి తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే,రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రం కనీసం గిరిజనులు అంటే ఎక్కలేనట్టు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. .గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని దరఖాస్తు పెడితే వివిధ కారణాలు చెప్పి తప్పించుకుంటున్న ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు కార్పొరేట్ నవయుగ ఆదాని కంపెనీలకు గిరిజనులు భూములు ఎలా ధారాదత్తం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు నిజంగా గిరిజనులు అంటే చిత్తశుద్ధి ఉంటే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణంపై ఇచ్చిన జిఓలను తక్షణమే రద్దు చేయాలని,లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కే కమల కే శ్రీనివాసరావు కె మోహన్ రావు ఎస్ రామారావు నచ్చిందా కే మాణిక్యం ఎస్ నరసింహ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ ఆవశ్యకతపై అవగాహన

కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమావేశం

. ప్రజాశక్తి -పాడేరు :పాడేరు ఏజెన్సీలోని పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు ఈ ఉన్నత స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్‌పి అమిత్‌బర్ధర్, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ, అరకు లోయ, అనంతగిరి, హుకుంపేట తహశీల్దార్లుతోపాటు ఎన్‌ఆర్‌ఇడి సిఎపి మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర బాబు, జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత పిఎస్‌పి ప్రాజెక్ట్ ఆవశ్యకత, ఈ ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ అనివార్యమైన అవసరం గురించి చర్చించారు. గుజ్జిలి, చిట్టంవలసలోని రెండు పిఎస్‌పి ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుత జారీ చేసిన జిఒ ప్రకారం 116 ఎకరాల అటవీ భూమి, 1302 ఎకరాల అటవీయేతర భూమి అవసరమని, దూదికొండ, భీమవరం, కుసుంవలస ప్రభావిత గ్రామాల్లో 304 ఎకరాలకే ముంపు పరిమితమౌతుందన్నారు. ఇందులో దూదికొండలో 12 గుడిసెలు, ముశ్రీగూడలో 52 గుడిసెలు, చిప్పపల్లి, డంబ్రిగూడ, మజ్జివలస ఉన్నాయన్నారు. తంగళగూడ, కొగువలస, అడ్డుమండ, శంకుపర్తి, దామపర్తి వంటి ఇతర గ్రామాలు ప్రభావితమవుతాయన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఈ ప్రాంతానికి చెందిన 400 మందికి ప్రత్యక్ష ఉపాధి, దాదాపు మూడు వేలమందికి పరోక్ష ఉపాధి లభిస్తుందన్నారు. సామాజిక, పర్యావరణ నిబంధనలకు లోబడి, ఆర్‌అడ్‌ఆర్ చట్టం పరిధిలో పునరావాసం కల్పిస్తారన్నారు

సం'క్షామ' వసతిగృహాలు

విరిగిన కిటికీలు, ఊడిన తలుపులు, పనిచేయని కుళాయిలు, మూలకు చేరిన మరుగుదొడ్లు..ఇదీ మన సం'క్షేమ' వసతిగృహాల పనితీరు. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని ఊదరగొడుతున్న మన ఏలికలు ఒకసారి ఈ వసతిగృహాల్లో బస చేస్తే పరిస్థితి అర్థమవుతుంది. శిథిలమైన వసతిగృహాల్లోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

- పెచ్చులూడుతున్న వంటగదులు
- కిటికీలు, తలుపులు లేని గదులు
- పని చేయని కుళాయిలు
- ఆరుబయటే భోజనాలు


విద్యార్థులు స్నానాలకు వినియోగిస్తున్న కుండీ


పెచ్చులూడుతున్న డైనింగ్ హాల్ (ఇన్‌సెట్లో) బాత్‌రూమ్‌లు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు గురుకుల పాఠశాలలో పూర్తిస్థాయి సౌకర్యాలు లేక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 'ప్రజాశక్తి' సోమవారం గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యలపై అధ్యయనం చేయడంతో సమస్యలు వెలుగు చూశాయి. పాఠశాలలో ఐదు నుంచి పదో తరగతి వరకు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదులు అరకొరగా ఉండడంతో పాటు, తరగతి గదుల తలుపులు, కిటికీలు ఊడిపోయి మరమ్మతులకు గురయ్యాయి. విద్యార్థులు స్నానపు గదులకు, మరుగుదొడ్లకు గత ప్రభుత్వంలో నాడు నేడు పనుల్లో భాగంగా పైపులైను వేసి కుళాయిలు ఏర్పాటు చేసి నీటిసౌకర్యం కల్పించారు. ప్రస్తుతం పైప్‌లైన్ మరమ్మతులకు గురి కావడంతో విద్యార్థులు ఆరుబయట బహిర్భూమికి వెళుతున్నారు. స్నానపు గదుల్లో కుళాయిలు పనిచేయకపోవడంతో కుండీలో నీరు స్టోర్ చేసి స్నానం చేయడానికి వినియోగిస్తున్నారు.

డైనింగ్ హాలు ఉన్నా...

400 మంది విద్యార్థులకు సరిపడా డైనింగ్ హాల్ లేదు. ప్రస్తుతం ఉన్న డైనింగ్ హాలు 100 నుంచి 150 మంది వరకూ భోజనాలు చేయడానికి సరిపోతుంది. అది కూడా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఏ సమయంలో పెచ్చులూడి మీద పడతాయో అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఇరుకు వంటశాలతో అవస్థలు..

తాత్కాలిక రేకుల షెడ్‌లో వంటలు చేస్తున్నామని కుక్‌లు వాపోతున్నారు. కుక్‌లు నలుగురే ఉండడంతో 400 మందికి వంట చేయడం కష్టంగా ఉందని తెలిపారు. వంట సామాన్లు భద్రపరిచే గది కూడా పాడైపోయింది.

వసతి లేక ఇబ్బందులు

విద్యార్థులకు పూర్తిస్థాయి వసతి భవనాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం కొంతమంది విద్యార్థులు డార్మెటరీని వసతిభవనంగా వినియోగించుకుంటున్నారు. మరికొంతమంది క్లాస్‌రూమ్‌లో తలదాచుకుంటున్నారు. సుమారు రెండు కోట్ల వ్యయంతో వసతి భవనం నిర్మించారు. అది ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు.

ఉపాధ్యాయులకూ వసతి భవనాలు లేవు

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు 18 మంది, రెగ్యులర్ ఉపాధ్యాయులు 14 మంది ఉన్నారు. వీరు ఉండడానికి ఇప్పటివరకూ భవనాలు ఏర్పాటు చేయలేదు. ప్రిన్సిపల్ కలెక్టర్‌కు వసతి భవనాలు కల్పించాలని లేఖలు రాశారు.

స్నానపు గదులకు కుళాయిలు లేవు

డార్మెటరీలో విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించాం. ఎటువంటి సమస్యలు లేవు. విద్యార్థులు ఆరోనారోగ్యానికి గురైతే వెంటనే వైద్య సేవలు అందిస్తున్నాం. ఉపాధ్యాయులకు మాత్రం నివాస భవనాలు లేక ఇబ్బంది ఉన్నమాట నిజమే. విద్యార్థులు స్నానపుగదులకు కుళాయిలు లేవు. వారికి ఇబ్బంది లేకుండా కుండీలో నీటిని స్టోర్ చేసి అందిస్తున్నాం.

– ఎల్. మోహన్‌కృష్ణ, వార్డెన్

శిథిల భవనంలోనే..


ఆరుబయట వరండాలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

విఆర్‌పురం: చిన్నమట్టపల్లి పంచాయతీ సున్నంవారిగూడెంలో ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతిగృహంలో పరిస్థితి దయనీయంగా మారింది. కటిక నేలపై నిద్రించాల్సిన పరిస్థితి నెలకొంది. డైనింగ్‌హాల్ లేకపోవడంతో వరండాలో భోజనాలు చేయాల్సి వస్తోంది. వసతిగృహం శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. శిథిలమైన భవనంలోనే వంటలు వండుతున్నారు. పర్మినెంట్ ఎఎన్‌ఎం లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని అర్ధరాత్రి సమయంలో ఎవరికైనా జ్వరం వస్తే మండల కేంద్రానికి తీసుకెళ్లాల్సి వస్తోందని నిర్వాహకులు తెలిపారు. వసతిగృహంలో 320 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే మంచినీరు వస్తుందని కరెంట్ లేకపోతే దాహం తీర్చుకోవడానికి మంచినీరు కూడా ఉండడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

శిథిలావస్థలో వసతిగృహం

వసతిగృహంలో భవనం పెచ్చులు ఊడి పడుతుండడంతో పిల్లలకు ప్రమాదం జరగకుండా వేరే రూమ్‌లో నేలపైనే పడుకోపెడుతున్నాం. విద్యార్థులకు తాగునీరు కరెంటు ఉన్నప్పుడు మాత్రమే అందుతోంది. కరెంటు లేకపోతే ఇబ్బందిగా ఉంది. మంచినీరు స్టోర్ చేసుకోడానికి ట్యాంక్ కూడా లేదు. 350 విద్యార్థులకు కేవలం 10 బాత్రూంలు మాత్రమే ఉన్నాయి.

– పూనం రాజయ్య, వార్డెన్, ఆశ్రమ ఉన్నత పాఠశాల, సున్నంవారిగూడెం.

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి జలాశయం నుంచి ఎపి జెన్కో అధికారులు సోమవారం నుంచి 15, 000 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారు. మొంథా తుఫాన్ లో భాగంగా జలాశయం ఎటువంటి ముప్పు వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టారు. డ్యామ్ సేఫ్టీ అధికారుల ఆదేశాల మేరకు డొంకరాయి జలాశయం నుంచి నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ రాజారావు వెల్లడించారు. స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 కాగా ఇటీవల డొంకరాయి పరిసరాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతంలో ఉన్న వలసగెడ్డ, పాలగెడ్డ మంగంపాడు తదితరు వాగుల నుంచి భారీ వరద నీరు జలాశయంలో చేరుతోందన్నారు. దీంతో జలాశయం నీటిమట్టం 1036.50 అడుగులకు చేరుకుందని తెలిపారు. డ్యామ్ సేఫ్టీ నిపుణులు ఆదేశాల మేరకు నెల రోజులుగా డొంకరాయి జలాశయం నీటిమట్టం 1035.50 అడుగులు వర్ద స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం తుఫాన్ ప్రభావంతో జలాశయానికి 20వేల క్యూసెక్కుల వరద ముప్పు ఉంటుందని డ్యామ్ సేఫ్టీ నిపుణులు అంచనా వేశారన్నారు. నీటిమట్టాలను 1030 అడుగులకు తగ్గించే చర్యల్లోభాగంగా 15,000 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి గేట్లు ద్వారా విడుదల చేస్తున్నామన్నారు. దిగువ ప్రాంతంలో ఉన్న ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. కాంప్లెక్స్ పరిధిలో సీలేరు జోలాపుట్ జలాశయాల వద్ద జెన్కో అధికారులకు అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు వరద నీరుని పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చీఫ్ ఇంజనీర్ రాజారావు తెలిపారు.

భారీ వర్షాల కారణంగా బస్సులు రద్దు

ప్రజాశక్తి -సీలేరు: మొంథా తుఫాన్ కారణంగా అల్లూరి సీతారామ రాజు జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ మేరకు విశాఖపట్నం డిపోకు చెందిన విశాఖ వయా చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ పగటిపూట తిరిగే విశాఖ వయ సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే బస్సు సర్వీస్ రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకూ రెండు బస్సు సర్వీసులు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

జిఒలు, చట్టాలు సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఏజెన్సీలో గిరిజనుల హక్కులు చట్టాలు జిఒలు సక్రమంగా అమలు చేస్తేనే ఆదివాసీ సమాజానికి మేలు జరుగుతుందని దండకారణ్య విమోచన సమితి ఏఎస్ఆర్ జిల్లా ఉపాధ్యక్షులు తాము సూరిబాబు సోమవారం అన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రంపచోడవరం ప్రాంతానికి జిల్లా విభజన చేయడం వలన ఆదివాసీ సమాజానికి లాభం ఎంత ఉందో, నష్టం కూడా అంతే ఉందన్నారు. రాజ్యాంగంలో ఉన్న అంశాలకు లోబడి ఉన్న చట్టాలు జిఒలు సక్రమంగా అమలు చేయాలన్నారు. భారతదేశం మొత్తం మీద ఆదాయ వనరులు 85 శాతం తమ ఆదివాసీ ప్రాంతమైన దండకారణ్య భూ భాగం నుండే వస్తుందని ప్రభుత్వం తెలియచేస్తుందని మరి ఈ ఆదివాసీల బాగు కోసం ప్రయత్నం చేయాలి కదా అని ప్రశ్నించారు.

ఇ - క్రాప్ నమోదుకు 30 వరకూ గడువు

ప్రజాశక్తి-చింతూరు: రంపచోడవరం ఎడిఎ రామ్మోహనరావు వరి పంట నమోదు కార్యక్రమాన్ని సూపర్ చెక్ కింద పరిశీలించారు.చింతూరు, ఎర్రంపేట, చుటూరూ, పెగ , ఏడుగురాలపల్లి మొదలైన గ్రామలో వరి పంట నమోదు పరిశీలించారు. ఈనెల 30వ తేదీ వరకూ ఇ క్రాప్ నమోదు జరుగుతుందని ఎవరైనా నమోదు చేయచుకోకపోతే రైతుసేవా కేంద్ర పరిధిలో నమోదు చేయించుకోవాలని తెలిపారు.



వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్, గిరిజనులు

వేంగడ పంచాయతీని అనంతగిరిలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి -అనంతగిరి : వేంగడ పంచాయతీని అనంతగిరి మండలంలోని కొనసాగించాలని కోరుతూ సోమవారం స్థానిక తహశీల్దార్ వీరభద్రాచారికి లిఖితపూర్వక వినతిపత్రం అందజేశామని మాజీ సర్పంచ్ సివేరి. కొండలరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలు, మండలాలు పునర్విభజనకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో వేంగడ పంచాయతీని హుకుంపేట మండలాన్ని విడదీస్తూ కొత్తగా ఏర్పడే ఉప్ప మండలంలో కలిపేందుకు అధికారులు సర్వేలు, ప్రతిపాదనలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో వేంగడ పంచాయతీ వాసులు ఆందోళన చెందుతున్నారన్నారు. వేంగడ పంచాయతీ పరిధిలోని గ్రామాల నుంచి ఉప్ప వెళ్లాలంటే చుట్టూ తిరిగి రానుపోను 80 కిలోమీటర్ల పైగానే ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు పంచాయతీ పరిధిలో 16 గ్రామాలలో 3వేలు మందికి పైగా జనాభా ఉన్నారని, ఇపుడు పంచాయతీని విభజించవద్దని కోరారు. పంచాయతీని విభజిస్తే ప్రయోజనం కలగాలని, అలాకాకుండా కొత్త కష్టాలు తెచ్చే చర్యలు సరికాదన్నారు. వేంగడ పంచాయతీని అనంతగిరి మండల కేంద్రంలోనే కొనసాగించాలని కోరారు పంచాయతీవాసులు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితులు తీసుకురావద్దని కోరారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు కల్యాణ్‌చ భీమన్న, సింహాద్రి, రాము, రాములమ్మ, ఎరకమ్మ, చంపావతి, దుర్గారావు.రామన్న పాల్గొన్నారు

అరకొరగానే జన్‌మన్ ఫలాలు

- నెలలు గడుస్తున్నా జమ కాని హౌసింగ్ అదనపు సాయం
- పివిటిజి గ్రామాల్లో అమలుకు నోచని అభివృద్ధి పథకాలు
- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన, వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ ,లబ్ధిదారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పిఎం జన్ మన్ గృహనిర్మాణ లబ్ధిదారులకు పెంచిన రూ లక్ష ఆర్థికసాయం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అరకువేలి మండలం సుంకరమెట్ట గ్రామ సచివాలయంలో లబ్ధిదారులు నిరసన చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు సర్పంచ్ గెమ్మెలి చిన్న బాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వెనకబడిన పివిటిజి గ్రామాల సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పిఎం జన్‌మన్ పథకంలో ఇల్లు లేని పివిటిజి కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షల ఆర్థికసాయం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వమిస్తున్న ఆర్థిక చేయూతతో ఇళ్లనిర్మాణం సాధ్యం కాని పరిస్థితుల్లో గిరిజన సంఘాల ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఒక్కో ఇంటికి అదనంగా మరో రూ.లక్ష సాయం పెంచుతున్నట్టు ప్రకటించి జిఒ విడుదల చేసిందన్నారు. అయితే జిఒ జారీ చేసి నెలలు కావస్తున్నా, నేటికీ లబ్ధిదారులకు పెంచిన సాయం అందలేదన్నారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి ఉందని ఆరోపించారు.

అలాగే ఈ పథకం కింద పివిటిజి గ్రామాల్లో 11రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండగా, అవి అమలు జరగడం లేదన్నారు. గ్రామ స్థాయిలో ఇల్లులు తప్ప, మిగిలిన 10 కార్యక్రమాల ఊసే లేదన్నారు. పివిటిజి గ్రామాల్లో రోడ్డు కనెక్టివిటీ, సిసి రోడ్లు, ,డ్రైనేజీ, విద్యుత్‌స్తంభాలు, కమ్యూనిటీ బిల్డింగ్, చెక్ డ్యామ్, అంగన్వాడీ బిల్డింగ్, పోడు భూమి పట్టాలు తదితర ఇతర కార్యక్రమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

.సుంకరమెట్ట పంచాయతీలోని సంఘంవలస, దాబుగుడ, పిరిబంద గ్రామాల్లో నేటికీ అంగన్వాడీ భవనం లేదని దీనిపై పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. వాపోయారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పిఎం జన్‌మన్ పథక లక్ష్యాలను అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టి, ఆదివాసీ గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు పి నానిబాబు,పి రంజిత్, కొర్ర చిట్టి బాబు,కొర్ర సింహాచలం, లబ్ధిదారులు బి దావీదు,బి రాజాశేఖర్,కిల్లో ఆనంద్ రావు, కొర్ర ఆనంద్ రావు,పి బాబురావు,వి కుమారి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎసిబికి చిక్కిన ఆర్ఐ, సచివాలయ కార్యదర్శి

ప్రజాశక్తి -తగరపువలస : ఇంటి యాజమాన్య హక్కు పేరును మార్పుచేసి పన్ను వేసేందుకు లంచం తీసుకుంటూ జివిఎంసి జోన్-1 రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముగడ రాజు, తగరపువలస బొగ్గు రోడ్డు -1 సచివాలయ కార్యదర్శి వై.స్వామినాయుడు సోమవారం సాయంత్రం ఎసిబికి పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఎసిబి డిఎస్‌పి వివిఎస్ఎస్.రమణమూర్తి కథనం ప్రకారం... చిట్టివలస గ్రామానికి చెందిన బాధితుడి తాత పేరుతో ఉన్న భవనానికి యాజమాన్య హక్కు పేరు మార్పుచేసి పన్ను వేయడం కోసం జివిఎంసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముగడ రాజును, సచివాలయ కార్యదర్శి స్వామినాయుడును కలిశారు. ఈ పని నిమిత్తం వారిద్దరూ రూ.60 లంచం డిమాండ్‌చేశారు. బాధితుడు చాలా రోజులు అధికారుల చుట్టూ తిరిగినా లంచం లేనిదే పని కాదని అర్థమైంది. డబ్బులు ఇవ్వలేని పరిస్థితుల్లో ఎసిబి అధికారులను బాధితుడు ఈ నెల 24వ తేదీన ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల ప్లాన్ ప్రకారం... బాధితుడు ముందుగా రూ.30 వేలు పట్టుకుని సచివాలయానికి వెళ్లాడు. సెక్రటరీకి రూ.30 వేలు ఇస్తుండగా అప్పటికే అక్కడ ఉన్న ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ, ఎవరైనా లంచం అడిగితే 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ దాడుల్లో ఎసిబి ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణరావు, సుప్రియ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టెట్ కోచింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- హుకుంపేట: మండల కేంద్రంలోని జ్ఞానసాగర్ వృత్తి విద్య కళాశాల ఆధ్వర్యంలో జ్ఞానసాగర్ టెట్ కోచింగ్ సెంటర్ ప్రారంభించినట్లు కళాశాల ఫౌండర్ బ్రహ్మకుమారి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 10 నుంచి జరగబోయే టెట్ పరీక్షలకు అడ్మిషన్లు కొనసాగుతున్నాయన్నారు. తమ కోచింగ్ సెంటర్‌లో అనుభవజ్ఞులైన బోధనాసిబ్బంది ఉన్నారని, ప్రతిఒక్కరిపైనా ప్రత్యేక వ్యక్తిగత శ్రద్ధతో పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో బోధిస్తారన్నారు. మహిళా అభ్యర్థుల కోసం పూర్తిస్థాయి రెసిడెన్షియల్ వసతి సదుపాయం, పురుష అభ్యర్థుల కోసం మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 9553880181, 8332050447, 8500925496 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చని బ్రహ్మకుమారి తెలిపారు.

పోలీస్ ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన



ఓపెన్ హౌస్ గురించి వివరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమిత్‌బర్గర్ రంపచోడవరం డిఎస్పి జి ఎస్ ప్రశాంత్ రాజవొమ్మంగి సిఐ గౌరీశంకర్ ఆదేశాల మేరకు సోమవారం జడ్డంగి, రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్లో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులతో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్డంగి, రాజఒమ్మంగి ఎస్ఐలు చినబాబు, శివకుమార్ ఓపెన్‌హౌస్ గురించి విద్యార్థులకు వివరించారు. పోలీస్‌స్టేషన్లో సిబ్బంది ఎవరు ఎటువంటి ఉద్యోగాలు చేస్తారో వివరించారు. ఫిర్యాదులు రిసెప్షన్ కౌంటర్ ద్వారా స్వీకరించి సదరు ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకోనబడతాయని తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఆయుధాలు ఏ సందర్భాల్లో ఉపయోగిస్తారో వివరించి ఆయుధాలను విద్యార్థులకు చూపించారు. విహెచ్‌ఎఫ్‌సెట్ ద్వారా ఏ విధంగా కమ్యూనికేట్ చేయాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం అరెస్టు చేసిన నేరస్థులను ఉంచే లాకప్‌సెల్‌ను చూపించారు. పోలీసుశాఖ నిర్వహణ విధానాలు, పోలీస్ స్టేషన్‌లో ఉండే పత్రాలు, ఆయుధాల గూర్చి వివరించారు. డయల్ 100,112 సేవల గురించి, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంతో బాటు మహిళలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి : పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆపర్ బాలుర పాఠశాలలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలు, పోలీసు శాఖ పనితీరు, నేరాల పరిశోధన విధానాలు, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పోలీసు శాఖ పనితీరును ఆసక్తిగా పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం నిరంతరం సేవ చేస్తోందని తెలిపారు. యువతలో జాగ్రత్త, బాధ్యత, సామాజిక అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసుల సేవలు, చట్టాలపై అరకులోయ సిఐ ఎల్ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు ఆధ్వర్యంలో అల్లూరి పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం అరకులోయ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా సిఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు మాట్లాడుతూ నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న సేవలను వివరించారు. పోలీసులు వినియోగించే ఆధునిక ఆయుధాలు, టెక్నాలజీ గురించి తెలుసుకోవడం అవసరమన్నారు. యువత చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మంచి ఆలోచనలతో భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ ఎల్ హిమగిరి

అంబేద్కర్‌వాది పావనమూర్తి మృతి



ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ అంబేద్కర్ వాది చింతకాయల పావనమూర్తి (93) సోమవారం ఉదయం సీతమ్మధారలోని అంబేద్కర్‌నగర్‌లో కన్నుమూసారు. నగరంలోని రామాటాకీస్ సమీపంలో అంబేద్కర్ భవన్‌ను స్థాపించిన వారిలో ప్రముఖులు. బిఆర్.అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి సుదీర్ఘ కాలం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సామాజిక సిద్ధాంతాన్ని విస్తృతం చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారు. సర్వ మానవ సమానత్వాన్ని కోరిన బుద్ధిజం అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆయన ఎంతో కృషిచేశారు. రాష్ట్రంలో బుద్ధిజం వ్యాప్తి చేయడం కోసం బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ స్థాపించి దానికి ఆయన ప్రథమ అధ్యక్షునిగా పనిచేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌ను దళిత, బహుజన ఉద్యమాల కేంద్రంగా మార్చి దళిత హక్కులు, సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిరక్షణ సాధన కోసం ఎంతగానో కృషిచేశారు. ఆంధ్ర యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగంలో అధ్యాపకునిగా సేవలందించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. మంగళవారం ఉదయం10 గంటలకు కెఆర్ఎం కాలనీలోని శ్మశాన వాటికలో ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు జరపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



బోరు బాగుచేయిస్తున్న ఎంపిపి వెంకటలక్ష్మి

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: లబ్బర్తి గ్రామంలో బోరు పాడైంది. గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఎంపిడిఒ యాదగిరేశ్వరావు, ఎంపిపి గోము వెంకటలక్ష్మికి గ్రామానికి చెందిన మహిళలు వినతులు ఇవ్వడంతో ఎంపిపి సోమవారం బోరు బాగు చేయించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ లోకరపు శివమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

సిసి రోడ్డు, కల్వర్టు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తదితరులు

ప్రజాశక్తి- జీకేవీధి : మండలంలో జర్రెల పంచాయతీ రామాలయం వీధిలో సర్పంచ్, వార్డు మెంబర్ ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో సిసి రోడ్డు, కల్వర్టు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయకత్వంలోఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీలకు నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. జర్రెల రామాలయం వీధిలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసి మరల నిట్టిమామిడిపాలెంలో కల్వర్టు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశామన్నారు. అలాగే రాబోయే పంచాయతీ ఎన్నికల్లో మంచి అలోచన ఉన్న వ్యక్తి ప్రజలు అధికారులతో మమేకమై రాజకీయ లక్షణాలు ఉంటు రాజ్యాంగం ప్రకారంగా చట్టలు హక్కులు కోసం బాధ్యత కలిగి పంచాయతీ సమస్యలు పై అధికారుల దష్టికి తీసుకువెళ్ళి అభివద్ధికోణంలో నడిపించే నిజాయితీగా పనిచేసే నాయకుడు కావాలని ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, యంపిటిసి కూటమి నాయకులు, వైసిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

హైవే కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- పీసా కార్యదర్శి తెడ్ల రాంబాబు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: కనీస నిబంధనలు పాటించకుండా ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాజవొమ్మంగి మండలంలో నిర్మిస్తున్న జాతీయ రహదారి 516 కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జడ్డంగి పీసా కమిటీ కార్యదర్శి తెడ్ల రాంబాబు సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలం లోని జడ్డంగి పంచాయితీ మెటల్ క్వారీ విషయంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశంలో చెప్పినప్పటికీ కాంట్రాక్టర్ పాతవిధానంలోనే క్వారీ నడుపుతున్నారన్నారు. ముందుస్తు సమాచారం ఇవ్వకుండా సోమవారం హైవే సిబ్బంది కొండను పేల్చేందుకు బాంబులు ఏర్పాటు చేశారు. భారీ శబ్దం రావడంతో అటు వైపుగా వెళ్తున్న మేకల కాపరి సుమార్ల వెంకటేశులు వైపుగా ఒక రాయి వేగంగా రావటంతో భయంతో పరుగులు తీస్తూ కింద పడిపోయాడు. తన చేతిలో ఉన్న కత్తి తగిలి తీవ్రంగా గాయపడ్డా డని రాంబాబు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా గాయం పెద్దది కావడంతో అడ్డతీగల ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది చెప్పారు. ఎన్ని సార్లు చెప్పినా జాతీయ రహదారి సిబ్బంది, కాంట్రాక్టర్ వారి విధానంలో మార్పు రాలేదని ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మొంథాపై అప్రమత్తంగా ఉండాలి

ఐటిడిఎలో హెల్త్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు



మానిటరింగ్ రూం పరిశీలిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్



అనంతగిరి: సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి- రంపచోడవరం : తుఫాన్‌కు సంబంధించిన కంట్రోల్ రూమ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ హెల్త్ మానిటరింగ్ సెల్ హాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో తుఫాను తగ్గేవరకూ కంట్రోల్ రూమ్‌లో ఉన్న సిబ్బంది ఎప్పటికప్పుడు తుఫాన్‌కు సంబంధించిన సమస్యలు తెలుసుకొని నివేదికలు సమర్పించాలన్నారు. ఏడు మండలాల నుండి ఏ సమయంలోనైనా బాధితులు కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేస్తే స్పందించి తగు చర్యలు చేపట్టాలన్నారు. కంట్రోల్ రూమ్‌ను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఎపిఒ జనరల్ డిఎన్వి రమణను ఆదేశించారు. తుఫాను నేపథ్యంలో రంపచోడవరం క్లస్టర్ పరిధిలోని ఉపాధి హామీ పథకం సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. ఐటిడిపి పిఒ స్మరణ్‌రాజ్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు ఉపాధి సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి పంచాయతీ మండల కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి, అవసరమైతే ఉపాధి శ్రామికులకు తక్షణ సహకారం అందించాల్సిందిగా సూచించారు.

జికెవీధి : తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రమణబాబు సూచించారు. మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొండ చరియలు విరిగిపడే ప్రాంతాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వాగులు, కాలువలు పొంగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఎంపిడిఒ బాలకృష్ణ, ఎమ్మార్వో అన్నాజీ రావు సప్పర్ల జిడబ్ల్యూ బాయ్స్ స్కూల్‌ను రిహాబిలేషన్ కేంద్రంగా గుర్తించామని తెలిపారు. ఎస్సై సురేష్ హాజరై ఏ విధమైన ప్రమాదం జరగకుండా ముందస్తు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. పలువురు అధికారులు హాజరయ్యారు.

సీలేరు: తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జికె వీధి మండలం సీలేరు పంచాయతీ కార్యదర్శి పరశురాం సూచించారు. సీలేరు పంచాయతీ పరిధిలోని కాలవల్లో పూడికలు చెత్త ఉంటే పంచాయతీ కార్యాలయానికి సర్పంచ్ దుర్జోకు సమాచారం అందిస్తే పారిశుద్ధ్య సిబ్బందితో వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం వేటమామిడి పంచాయతీ పనుకురాతి పాలెం ఏలేరు వాగు దాటవద్దని ఎంపిడిఒ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన వాగు దాటుతున్న గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వి.ఆర్.పురం: తుఫాన్ నేపథ్యంలో మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి కారం లక్ష్మి సూచించారు. ఉమ్మిడివరంవైపు వెళ్లేవారు అన్నవరం వాగు దగ్గర అప్రమత్తంగా ఉండాలని వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

తుపాన్ అప్రమత్తతపై మైక్ ప్రచారం

హుకుంపేట: మొంథా తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూకూరు సర్పంచ్ సత్యవతి పిలుపునిచ్చారు. ఆటోలో మైక్ ఏర్పాటు చేసి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తిరుగుతూ దండోరా ద్వారా తుపాను హెచ్చరికలు, జాగ్రత్తలపై ప్రచారం నిర్వహించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, మేకలు, పశువుల కాపర్లు ఉరుములు, పిడుగుల పడే అవకాశం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. తుపాను నష్టాలపై సచివాలయం, సర్పంచ్, సెక్రటరీ లేదా విఆర్ఒలకు సమాచారం అందించాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీ సరోజిని, హార్టికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మూగజీవాలను సురక్షిత ప్రాంతంలో ఉంచాలి

అనంతగిరి : తుపాన్ సమయంలో మూగజీవాలను సురక్షిత ప్రాంతంలో ఉంచాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం రైతులకు కోరారు. మండలంలోని కాశీపట్నంలో పర్యటించిన అనంతరం పశువైద్యశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మూగజీవులు మృత్యువాత పడితే, నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు నష్టపరిహారం అందించి ఆదుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపిపి నేలవేణి సర్పంచ్ అప్పారావు అనంతగిరి. సుంకరమెట్ట వైద్య అధికారులు డాక్టర్ అనిల్. డాక్టర్ చిన్నయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

బ్యాంకు రుణమేళాలో రూ2.59 కోట్లు చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి

వెదురు మొక్కల పంపిణీ



మొక్కలు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: ప్రభుత్వం రైతులకు, మహిళలకు అందించే రాయితీలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం బ్యాంకు లింకేజి రుణాలు చెక్కు పంపిణీ కార్యక్రమం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కానెం విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ మహిళా సాధికారతకు శ్రీకారం చుట్టిందే తెలుగుదేశం పార్టీ అన్నారు. మహిళల అభివృద్ధికి మంచి అవకాశాలు కల్పించే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. అనంతరం 60 స్వయం సహాయక సంఘాల 360 మంది సభ్యులకు బ్యాంకు లింకేజి (రుణ మేళా)లో భాగంగా రూ 2.59కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం మారేడుమిల్లి, వై. రామవరం మండలాల్లో గిరిజన రైతులు 887 మంది రైతులకు 53,220 మొక్కలు పంపిణీ చేశారు. ప్రత్యేక పథకం జిల్లాలో 4 మండలాలకు కేటాయించగాఉపాధి హామీ పథకంలో దీనిని ఉత్పత్తికి చర్యలు చేపట్టేలా ప్రభుత్వం చూస్తుందన్నారు. వీటి ఉత్పత్తి కొరకు వస్తుసామాగ్రి తయారీ కొరకు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వివిధ సమస్యలను ఆమె పరిష్కరించారు. కొన్ని సమస్యలు సంబంధిత శాఖాధికారులకు తెలిపి పరిష్కారమైందా లేదా అనేది తనకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె సునీత, రాష్ట్ర నూర్ భాష కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాన్, మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేష కుమార్, ఉపాధ్యక్షులు కర్రి సన్యాసిరెడ్డి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు మళ్ల దుర్గా ప్రసాద్, బిజెపి మండల అధ్యక్షులు రేవుల రామకృష్ణ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మొక్కలతో ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలో వడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని వడ్డిగూడెంలో సతి పార్వతి రుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో శివాలయ దేవస్థాన కమిటీ చైర్మన్ బొర్రా ఆదినారాయణ ఆలయ ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు మంచి ఆహ్లాదకర వాతావరం ఉండాలనే ఉద్దేశ్యంతో వీటిని నాటామని తెలిపారు.

విసిసి బాలల దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం,వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) బాలల దినోత్సవం 2025 పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ దీప జలోక, వైస్ ప్రెసిడెంట్ సునీత విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,విసిసి చేస్తున్న కార్యక్రమానికి సహకారం అందిస్తున్నామన్నారు.ఈ సంవత్సరం ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి 'ప్రొటెక్టింగ్ అండ్ చెరిషి చైల్డ్ హుడ్' నినాదంతో చిల్డ్రన్స్ డే సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని విసిసి ఫౌండర్ డాక్టర్ కె.రమాప్రభ తెలిపారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా వున్న 135 క్లబ్స్‌లో బాలల దినోత్సవం 2025 పోటీలు నిర్వహిస్తామని విసిసి కన్వీనర్ కె.సుశీల అన్నారు. ఈ ఆటలు పోటీలు నవంబరు 2న ప్రారంభమై 14 వరకూ జరుగుతాయన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్,సీనియర్స్‌కి వారి ఆసక్తిని బట్టి విడివిడిగా పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9347205549 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో విసిసి నుంచి పిఎన్.మణి,ఆర్ సరోజ, పి.సతీష్, పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశాల వయోపరిమితి తేదీని సవరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సైనిక పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు నిర్దేశించిన వయోపరిమితి తేది మార్చి 31 నుండి జూలై నెలకు మార్పు చేయాలని యువసమ్మేళనం సభ్యులు కె.అభిమన్యు కోరారు. సోమవారం కంచరపాలెం బిఎన్ఆర్ భవన్‌లో తల్లిదండ్రులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం నవోదయ ఆరో తరగతి ప్రవేశానికి అర్హత పొందిన విద్యార్థి సైనికస్కూల్ ప్రవేశానికి అనర్హులుగా పరిగణిస్తున్నారన్నారు. మార్చి 31 వయోపరిమితిగా పరిగణించడం వలనే ఇటువంటి సమస్య వస్తోందని, జూలైకి మార్చినట్లయితే అందరూ విద్యార్థులు అర్హత సాధిస్తారని తెలిపారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు, జూలైనే ప్రామాణికంగా తీసుకుంటున్నారని సైనిక్ స్కూల్ సొసైటీ, ఉన్నతాధికారులు స్పందించి మార్పు చేయాలని కోరారు.

విపిఎ విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకూ జరిగే వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పోర్ట్ పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆటోరియంలో నిర్వహించారు. విశాఖపట్నం పోర్ట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అరుణ్ ప్రసాద్ పోర్ట్ విభాగాధిపతులతో కలిసి. అధికారులు, సిబ్బందితో 'విజిలెన్స్ ప్రమాణం' చేయించారు. కార్యక్రమంలో పోర్ట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.